## తారాగణము :

వరలక్ష్మి అంజలీదేవి, నాగేశ్వరరావు, శివరావు, గాడేపల్లి సదాశివరావు, ఎ. యల్. నారాయణ, జి. నారాయణరావు, బి. సీతారాం, యన్. కృష్ణయ్య, జి. సుబ్బారావు, లింగం సుబ్బారావు, అయ్యంగార్, సి. రాజరత్నం, నారీమణి, కృష్ణవేణి.

# కథా సంగ్రహము

మనసూ మనసూ కలవాలేగాని మహేంద్రు డెదురొడ్డినా మమతమార్చి, మటుమాయం చేయలేడు. మోహిని విషయం అక్షరాలా అలాగే జరిగింది. మోహిని ఒక దేవకన్య; బాగా నృత్యం చేస్తుంది. పాడుతుంది కూడాను. ఆమె ఒక యక్షుణ్ణి ప్రేమించింది. వాళ్ళు చిలకా గోరువంకలల్లే జీవితసుఖ నవోదయాన్ని ఆనందిస్తున్నారు. నందనవనంలోని ఈ ఆనందవీచిక మహేంద్రునిదాకా వీచింది. మోహిని విషయం, చిన్ననాటినుంచీ ఇంద్రుడి మనసంతా మోహినిమీదే ఉంది. నా సమక్షంలో నృత్యం చేయించమని ఆమె తండ్రికి చెప్పాడు. తండ్రి ఆమెకు, నయాన భయాన చెప్పాడు. కాని ఆమె అంగీకరించలేదు. మహేంద్రుడికి నిజం చెప్పాడు మోహిని తండ్రి, యెవడో యక్షుడు నిరోధిస్తున్నాడని మహేంద్రునికే ఎదురునిలిచే ఆ యక్షు డెవరని కుబేరుణ్ణి కూపీ అడిగాడు ఇంద్రుడు. కుబేరుడు నేను చక్కదిద్దుతానని హామీచెప్పి, యక్షుణ్ణి పిలిపించి మందలించాడు. యక్షుడు మోరాయిస్తే ప్రేమనెరుగని మానిసివై పుట్టమని శపించాడు. మోహిని ఎంతో బ్రతిమాలింది తప్పునాదనీ శాపవిమోచన చెప్పమనీ; శచీపతిని వేడుకోమన్నాడు కుబేరుడు. ఇంతలోనే ఇంద్రసేవకులు, మోహినిని ఇంద్రసభకు తెచ్చారు. ఇంద్రుడు నవ్వి ఇప్పుడైనా కాలికి గజ్జెకట్టమన్నాడు. మోహిని ససేమిని మొండికేసింది. మహేంద్రుడికి మండిపోయింది. మానవివై పుట్టి ఫలించని ప్రేమతో అల్లాడమని శపించాడు. యక్షుడు వెలమవారింట పుట్టి బాలరాజై పెరుగుతున్నాడు. మోహిని కమ్మనాయుడికి నాగేటి చాలులో దొరికి సీతమ్మగా పెరిగింది.

సీత దొరికిననాటినుంచీ, కమ్మనాయుడికి బాగా కలిసివచ్చింది. సీతకు పెళ్ళీడువచ్చింది. కులపువాళ్ళంతా సీతకు పెళ్ళిచేయమని కమ్మనాయుణ్ణి తొందరచేశారు. సీతతోవచ్చిన సిరి, సీతతో పోతుందని

కమ్మనాయుడు పెళ్ళిచెయ్యాలని మూర్ఖించి, ఆమెను వూరి వెలుపల ఒక ఒంటిస్థంభం మేడలో నరుల కంటపడకుండా పెంచుతున్నాడు. ఒకనాడు బాలరాజు చెలికాడు యెల్లమంద ఆ యింటిదారినే వెళుతూ ఉండగా సీత చూచింది. పాతప్రేమలు చిగురించినై. రాత్రివేళ ఆప్రాంతంలోనే మందవిడిసి, బాలరాజు పిల్లనగ్రోవి ఊదుకుంటున్నాడు. విరహపడుతున్న సీతకు పిల్లనగ్రోవి పాట మళ్ళీ వినగానే ఒళ్లు ఝల్లుమన్నది. ఇల్లు విడచి సీత బాలరాజును కలిసింది. మనసు తెలిపింది. బాలరాజుకు ప్రేమేం తెలుసు ? ఇదేదో క్రొత్తపీడ చుట్టుకుందని సీత నిద్రలో నుండగా అర్థరాత్రివేళనే స్నేహితుణ్ణి తీసుకుని వెళ్ళిపోయాడు. వాళ్ళను వెతుక్కుంటూ సీత వెళ్ళింది. తెల్లవారేసరికి పిల్ల కనపడక అయినవాళ్ళంతా తెకతెకపడ్డారు. ఎలావచ్చిందో అలాగే వెళ్ళిపోయిందని సరిపెట్టుకున్నారు.

బాలరాజును వెతుక్కుంటూ వెళ్ళి వెళ్ళి మళ్ళీ కలుసుకుంది. ఈ బాధ తొలగేటట్టులేదని గంగదొరకని గహనమధ్యంలో 'దాహం దాహం' అని బాలరాజు దొంగఎత్తువేశాడు. నిజమేనని నమ్మి వరుణదేవుని ప్రార్థించి నీరు పుట్టించుకొచ్చింది సీత. ఈమె మానవికాదు దెయ్యమని పారిపోయారు, బాలరాజు యెల్లమంద. అడవిచుట్టూ తిరిగి తిరిగి, దారేపోయే ఒక సెట్టిని కలుసుకున్నాడు బాలరాజు. ఆకలికొద్దీ అతనిదగ్గర తినుబండారాలు తింటూఉండగా సీత వచ్చింది. తిన్నదానికి ప్రతిఫలంగా సీతమ్మను కుదువబెట్టి వెళ్ళాడు బాలరాజు. సెట్టిని మాయజేసి తప్పించుకుని, బాలరాజును వెతుక్కుంటూ బయలుదేరి మళ్ళీ కలుసుకుంది. నిజంగా, ఇదేదో దయ్యమేనని కాలికి బుద్ధిచెప్పారు బాలరాజు, యెల్లమంద. అయినవారిని కాదనుకుని ఆశ్రయిస్తే, అడవిపాలుచేసి పోవద్దని ఆక్రందించింది సీత. అగ్నిదేవుడు ఆమె ననుగ్రహించాడు. అడివంతా అగ్నిజ్వాల అల్లుకున్నాయి. దారితెలియక దేవురిస్తుంటే సీతమ్మ అగ్నినణచివేసింది. బాలరాజు కేమిచెయ్యాలో తెలియలేదు. ఆ రాత్రిల్లా ఆమె చెప్పినట్టు నడచుకొని నిద్రపొయ్యారు. నడిరేయి అడవిదొంగలు మత్తుజల్లి సీత నెత్తుకెళ్ళారు.



మర్నాడు నిద్రలేచేసరికి సీత లేదు. యెల్లమందను అక్కడే వుండమని సీతను వెతుక్కుంటూ బాలరాజు అడవివెంట పడ్డాడు. ,, ఆలీమగడి సరాగం అది. ఇక వాళ్ళురారు. మనం పోదాం రా'' అని ఒక బాటసారి యల్లమందను ఇంటికి మళ్ళించాడు.

బాలరాజు సీత జాడలు వెతుక్కుంటు ఒకచోట ఒక మునీశ్వరుణ్ణి అడిగాడు. అతడు ప్రసన్నుడు కాలేదు. బాలరాజు ఉగ్రుడై ఒక చచ్చిన పామును తెచ్చి అతని మెడలో వేశాడు. ముని కోపించి నీవుకూడ పామై పొమ్మని శపించాడు.

ఆడిపాడి, లాలించి, మోసగించి ఎలాగో దొంగల బారినుంచి తప్పించుకొని, బాలరాజును వెతుకులోంది సీత. బాలరాజు కనపడక పోగా, ఆమె కాళ్ళచుట్టూ పాము చుట్టుకుంటోంది. వృద్ధబ్రాహ్మణుడై కన్పించి, ఆ పామే బాలరాజని మునిశాపమువల్ల అలాగైనాడని, తీర్థయాత్రలవల్ల శాపవిమోచన కాగలదని చెప్పి అగ్ని మాయమయ్యాడు. పాపం ! సీత ఆ పామును నెత్తిన పెట్టుకొని నదీనదాలలో మునిగి అన్ని యాత్రలూచేసి, ఎట్టకేలకు ధనుష్కోటిలో మళ్ళీ బాలరాజును చేసుకుంది.

ఒకనాడు వారు ఒక అడవిప్రక్క పల్లెదిక్కు చేరేసరికి ఆకలివేసింది. ముడిసరుకులు తెమ్మని చేతి మురుగునిచ్చి బాలరాజును ఊరిలోకి పంపింది. అడవిలోని సెట్టే పెద్ద సెట్టయ్యాడు. మురుగు గుర్తుపట్టి ఇది దొంగసొమ్మని, ఎత్తువేసి, బాలరాజును తరిమించాడు. ఆ దొమ్మిలో ఒక ఈటె బాలరాజుకు తగిలి, బాలరాజు చచ్చిపోయాడు. మురుగు ఆనవాలు పంపి బాలరాజు రమ్మంటున్నాడని, సెట్టి సీతకు కబురుచేశాడు. నిజమేననుకుని సీతవచ్చింది. తీరా వచ్చింతరువాత, సెట్టి చెరబట్టాడు. దేవుడు దయవల్ల మానభంగం కాకుండా బయటపడి పారిపోతుంటే, బాలరాజు శవం కాలికి తగిలింది. విషయం తెలిసి విలపోయింది సీత. సెట్టి ఇద్దరూ తోడుదొంగలని నిందారోపణచేశాడు. కాదని రుజువుచేయటానికని సీత అగ్నిలో ఉరికింది. అగ్నిదయవల్ల, అశ్వనీ దేవతలు ఆమెకో

సంజీవిమాల కానుక ఇచ్చారు. దానితో ప్రేమతో తాకితే చచ్చిన మనుషులు బ్రతుకుతారు, కోపంతో విసరికొడితే, చచ్చిపోతారు. దాని మహిమవల్ల మళ్లీ మగణ్ణి బ్రతికించుకుని, చివరకు ఒక దేవాలయంలో నిద్రపోతున్నారు దంపతులు.

ఇంటిదారి పట్టిన యెల్లమందకు దారిలో ఒక పిల్ల తటస్థపడింది. కీలకం తెలుసుకుని బుట్టలో వేశాడు. తీరా ఆటకట్టేసరికి కామమ్మ మొగుడికథయై బయటపడ్డాడు.

సీత సంగతులన్నీ ఇంద్రుడికి తెలిసినై. శివాలయంలో మైమరచి నిద్రపోతున్న సీతను ఇంద్రజాలంతో ఇవతలకు తెచ్చి, నట్టడవిలో వేటగాడి వేషంలో సీతను నిర్బంధించాడు. సీతకు చెడ్డ కోపంవచ్చి శపింపబోయేసరికి అదిరిపోయి, అదృశ్యుడయ్యాడు. సీతను సాధించాలని, తాను మాయసీతగా మారి వచ్చి, బాలరాజు ప్రక్కన పడుకుని సరసాలు సాగించాడు. నిజం తెలియని బాలరాజు, అదే తన సీతని సరసాలాడుతున్న సమయంలో అసలు సీత వచ్చింది. ఇద్దరు సీతలను చూచేసరికి బాలరాజుకేమీ అర్థంకాలేదు. ఏది మాయో, ఏది నిజమో, సీతలిద్దరు, నేనంటే నేనని పోట్లాడుకున్నారు. ఎంత సేపటికి తగవు తెగలేదు. అసలు సీతకు అరికాలిమంట నెత్తికెక్కి సంజీవిమాల విసిరింది. మాయసీత బాలరాజును ముందుకు లాక్కుంది. సంజీవిమాల బాలరాజుకు తగిలి అతను చచ్చిపోయాడు. మాయసీత ఇంద్రుడై మారి ఇకిలించాడు. సీత మోసం గ్రహించింది. తాచుబాము కోపం వచ్చింది. ఇంద్రుణ్ణి ఇక సహించకూడదనుకుని శపించబోయింది. శివుడు దేవతలు దిగివచ్చి ఆగమన్నారు. శచీదేవి భర్తృభిక్ష పెట్టమని ప్రార్థించింది. సీత ఒప్పుకోలేదు. శివుడు బాలరాజును బ్రతికించి, ఇంద్రుణ్ణి క్షమించమని బ్రతిమాలాడు. బాలరాజును చూచి, సీత సరేనన్నది. క్రొత్త దంపతులను స్వర్గ దంపతులు స్వర్గానికి రమ్మని ఆహ్వానించారు. ప్రేమను గౌరవించని ఆ స్వర్గంకంటే ఈ భూతలస్వర్గమే మాకు చాలని సీత నిరాకరించింది. సీతా బాలరాజులు చిరంజీవులై భూమిమీదే సుఖంగా ఉండిపోయారు.

సంపూర్ణం

ప్రతిభా వారి

# బాలరాజు

ప్రొడ్యూసర్ + డైరెక్టర్... జి. బలరామయ్య

## గ్రూప్

నవోదయం – శుభోదయం
నవయుగశోభా – మహోదయం ॥నవో॥
ఆడునదిగో – అరుణపతాకం
పాడునదిగో – నవయువలోకం
స్వతంత్రజీవన – ప్రభాతగీతం, ప్రబోధ గీతం ॥నవో॥
జవరాలి మేలి – చెంగావి మోవి
నవరాగరేఖ – లవిగో
నవనవోల్లాస – యువజనాళిలో
అనురాగశోభ – లవిగో
మాటవినము – ధనేశుడైన
పాటిగొనమిక – సురపతియైన
సమానపదమే – నవీననియతి ॥నవో॥

♦ ♦ ♦

## మోహిని

తీయని వెన్నెల రేయి
ఎడబాయని చిన్నెల హాయీ – ఓరసపాయీ ॥తీ॥
నటనమే బ్రతుకోయీ.....................
ఊగే పూలలోనా – మునుసాగే అలలలోనా
చెలరేగే గాలిలో – నా కాలిమువ్వలలో
కదలికే, కదుహాయీ – నటనమే బ్రతుకోయి
మొయిలుభామ వడిలో – నడలోసుడులువారీ



వనమయూరినై మీరీ
తమిదీర ఆడుదు నే
దరియగారావోయీ
నటనమే బ్రతుకోయీ ॥తీ॥

♦ ♦

సీత

ఎవరినే నే నెవరినే...
వగవగలా నే నెవరే... ॥ఎవ॥
విరిసీవిరియని రేకల
మురిసే మురిపెము నే
తరతరాల వరాలైన
తరుణారుణశోభనే
నే......నే......నే......
జగజగాల చిగురులకూ
ఎగిరిపోవగోరుదు నే
యెవరే నన్నెగురనీరు ఎందుల కీబంధమూ
ఎవరెరుగని గాధనే ఏమో తెలియని బాధనే ॥ఎవ॥

♦ ♦ ♦

రాములు

చూడ చక్కని సిన్నదీ ఆ – మేడగదిలో నున్నదీ......
ఏడులోకా లెగసీ వచ్చి – జోడులే నీ మేడలోన
ఏడువన్నెల కోక గట్టి–ఆడుకొంటూవున్నది...... ॥చూ॥

♦ ♦ ♦

సీత

నీకు నీవారులేరు – నాకు నావారులేరు
గాలిలోన తేలిపోదాం పదరా – నాపాలిరాజా
నీకు నాకు జోడు కలసెనుగదురా



ముష్టివారు

గూటిలో చిలకేదిరా అన్నా – గూడు చిన్నబోయెరా... ॥గూ॥
కోటదాటీ పేటదాటీ – బాటలేని అడవిదాటీ
గూటిలోని రామచిలుకా – గుట్టలాపాలాయె రన్నా ॥గూ॥

♦ ♦ ♦

సీత

ఓ బాలరాజా..................
ప్రేమే ఎరుగవా...ఓ వెర్రిరాజా...
ఓ బాలరాజా................
రాజా...ప్రేమ అదేనోయ్ యిదేనోయ్
కోయిల కువకువలూ......పూవుల గమగమలూ...
హాయీ హాయ్ ప్రేమయిదేనోయీ
వయ్యారీ తార భామతో చందమామతో
కలసీ మెలసే వలపులో హాయ్
అ.......................
హాయే హాయ్ ప్రేమయిదేనోయీ......

♦ ♦ ♦

సీత

వరుణా......వరుణా
వర్షింపగదయ్యా వరుణా వరుణా
కరుణాలయు ఏకధారగా ॥వ॥
ఘనాఘనా ఘనాఘనా
ఘనాఘనా వినీల గగనానికి భూతలికి ॥వ॥
దిశాంచలము లలముకొనుచు వెలారీ
పయోధరములు తెరలు తెరలుగా వెలసీ
ఫెళ ఫెళ ఫెళ ఉరుము లురిమి
తళతళమని మెరపు మెరసి
నెరవారిన సరసులలో
నీరునిండి వరద పారగా ॥వ॥





### సీత

ఓ బాలరాజా......
జాలిలేద బాలరాజా...బాలరాజా
చలమేలమానరా ఓరుగేలరా......
నిన్నువీడి నిలువజాల నా రాజరాజా ॥ఓ॥
ఈడుజోడుగాన నీదాననోయిజాణ
కదలకు రాజా...నను వదలకు రాజా......
మాయని మమతలు మదిలో రేపీ పూపీ
మాయగ మాయమయేవా పగలా వగలా ॥ఓ॥

♦ ♦ ♦

### ఎలమంద

దేముడయ్యా దేముడూ మాయదారిదేముడూ
మటుమాయదారి దేముడూ మాయాదేముడూ
ఊరెల్లా యిళ్లుచేసె నోరెల్లా పళ్లుచేసె
మంచమెల్లా గళ్లుచేసె కంచెల్లా ముళ్ళుజేసె
నల్లని మేకలపాలూ తెల్లజేసేదేముడూ
తెల్లనిపాలల్లో నీళ్ళు తెల్లజేసే దేముడూ
ఊరిలోని పుప్పురాయి అడవిలోని చెట్టుకాయ
చేరదీసి పూరకాయ చేసెనయ్యా దేముడూ
ఆడ మగవారనీ తేడాతో సృష్టిజేసె
పాడుప్రేమకలుగజేసి కూడదోసే దేముడూ
కల్లకపట మెరుగనోణ్ణి చల్లగ నట్టడవికీడ్చి
కల్లదాన్ని కళ్లజూపి వల్లోవేసేదేముడూ ॥దే॥

♦ ♦ ♦

### బాలరాజు

చెలియా కనరావా ఇక – చెలియా కనరావా
నిరాశబూని పోయితివా – ఓ చెలియా కనరావా



ఓ చెలియా కలయేనా మనగాధ – చెలియాకనరావా
ఏకోనలలోన నిను కానా – ఏదారిపోయితివో నాదారిఏమో ॥చెలి॥
తనువు మనసు నీదే నా – తనువు మనసు నీదే నీదే
నని బాసచేసినావే జవరాల
రారాని కోపాలు నాపైన నీకేల ॥చెలియా॥

♦ ♦ ♦

### సీత

తేలీ చూడుము హాయి సాటిలేని యీ రేయి
రేపు నీకు రాదోయి యీ హాయి ॥తేలి॥
మేనులు మరచి యీ జగమే మరచి – కనరా స్వర్గసీమలోన
చిన్నారికన్నె ప్రేమలోనా మహానందము
రేపు నీకు రాదోయి యీ హాయి బలెబలెహాయి ఆపినా
నిలదోయి కనరా దొరా రేపు
నెరజోడుపైన మిఠారి బాలా
కమ్మని మోవితేనె
కుమ్మరించిపోవే సమ్మతించవే
బలశాలి ఎవరో వానిదేఫలమూ
రేపునకు నీకు రాదోయి
యీ హాయి ॥తేలి॥

♦ ♦ ♦

### సీత

రాజారారా నా రాజారారా
బెదరకురా రాజా బిగువుసేయ
కురా రాజా...... ॥రాజా॥
నామదీ చెదరీ బెదరితిరా నే
కరుణమానక బిరబిరా
నా దరికి పరుగిడి రారా ॥రాజా॥

## సీత

రాగమాలిక

రూపము నీయరయా పతి – రూపము నీయరయా
నాపతి శాపము బాపీ నిజ – రూపము నీయరయా
నాథుని సేవకు నోచగలేని – నారీజన్మము దేనికయా ॥నిజ॥
తమకేనియు దయరాదా మాపై
మము కనరాదా మొరవినరాదా
ఆ పన్నుల సొద ఆర్చి తీర్చుటే
తాపస ధర్మము కాదా ॥నాపతీ॥
పతిసేవా వ్రత విలసితులారా – పరమపుణ్యవతులారా
గోమాతా నిను కొలచినవారికి – కొరత తీరునట కాదా ॥పతి॥
కౌగిటిలో శ్రీ రంగని పొందివే – కావేరీ నను కనికరింపవే
శరణాగత సంత్రాణుడవని – నీదరిని జేరి నను కావుమనంగా
మొరవిన కీగతి నిదురబోదు
కను దెరువుమయ్యా కావేటిరంగ ॥పతి॥
పతియే సతులకు పరమదైవము – పతిసేవనమే పరమ ధర్మము
కోరిన వరమీయు దొరసానినీవె
కోరిక తీర్పవె మధుర మీనాక్షి ॥పతి॥
భవభయ భంగా రామలింగా – పతిత జనావన దయాంతరంగా
రామలింగా రాముని ప్రియురాలి – దయగని నావే నామొరవిని
నను కావగలేవా రామలింగా – కరుణాసాగర సాగర
కోటినదులు నీలో కలవట – చోర మీటివేతువట పాతకంబుల
నా పాటు దీర్చి నా పతిని గూర్ప – ముమ్మాటి కీవే దేవా

♦ ♦ ♦

## ఎలమంద

వరాలకూన నిన్ను – కాన కోనవెతికే నే
నీకోస మెన్నో కలలు – కాచికాచి కొన్నా నే పిల్లా పిల్లోయ్



గునాలగున్న నిన్ను నూడ – నూడ మనసౌనే
నీ జంట నిలచితేను పిల్లా–చిట్టీ–నరక మైన సుఖమే నే
నీ జంట నిలచితేను–నరక మైన సుఖమే నే
వరే వవ్వా తోడుదొరికేవె నా పిల్లా దొరికేవె
నాపిల్ల ॥నా॥

♦ ♦ ♦

## కామిక్ డ్యూయట్

ఎలమంద

ఒకరిని నానవేశాన్ – ఒకరిని చిదుగగొట్టేన్
ఒకరిని చేతబట్టి – నే నొస్తినోయ్ మామా
నే నొస్తినోయ్......
ఎవరిని నానవేశావ్ – ఎవరిని చిదుగగొట్టేవ్
ఎవరిని చేతబట్టి – నీవస్తివే పిల్లా నీవొస్తివే
సున్నమును నానవేశాన్ – చెక్కలను చిదుగగొట్టేన్
ఆకులను చేతబట్టి – నే నొస్తినోయ్ మామా
నే నొస్తినోయ్......
ఒకరిని వారవేశాన్ – ఒకరిని చేరదీశాన్
ఒకరిని పక్కనుంచి – తొంగుంటినోయ్ మామా
తొంగుంటినోయ్......
ఎవరిని వారవేశావ్ – ఎవరిని చేరదీశావ్
ఎవరిని పక్కనుంచి – తొంగుంటివే పిల్లా
తొంగుంటివే......
తలుపును వారవేశాన్ – మంచాన్ని చేరదీశాన్
తలగడ పక్కనుంచి – తొంగుంటినోయ్ మామా
తొంగుంటినోయ్......
ఒకరికి కాళ్ళు యిచ్చాన్ – ఒకరికి చేతులు యిచ్చాన్
ఒకరికి నడుమునిచ్చి – నే నొస్తినోయ్ మామా
నే నొస్తినోయ్......

ఎవరికి కాళ్లు యిచ్చావ్ - ఎవరికి చేతులు యిచ్చావ్
ఎవరికి నడుమునిచ్చి - నీవొస్తివే పిల్లా

**నీవొస్తివే పిల్లా......**

కడియానికి కాళ్లు యిచ్చాన్ - గాజులకు చేతులు యిచ్చాన్
వడ్డాణ్ణానికి నడుమునిచ్చి - నే నొస్తినోయ్‌మామా

నే నొస్తినోయ్......

♦ ♦ ♦

## సీత

వేరెలేరయా పరమేశా, మరి - ధరనీ సాటిదైవమూ ‖వేరే‖
నిన్నూనమ్మి సేవించీ...తని - వోనివారలే లేరయ్యా ‖వేరే‖
కరుణా మరువకురా శంకరా - పరిణయ సుఖమీయరా -
సదానీదు చరణములే, మది - నమ్మినానురా - కావగా ‖వేరే‖

♦ ♦ ♦

## డ్యూయట్

సీత—చాలుఁ రావగలూ - ఇక చాలులా వగలూ
అయినావి రాళిచాలూ - అలుకలతో పనేలరా
మలయకురా మనోహరా - మనవీ వినరా మనోహరా ‖చాలు‖
బాల—బ్రాణముపోసిన దాతవుచెలియా - మరువగ నాతరమా -
సీత—నాదైవమీనాడు నన్నేలె రాజా
నాటికీనాడు నారాజు నన్నేలెనోయి
ఏలెనోయీ - నన్నేలెనోయీ
నా ప్రియాసా - ఫలించె నాథా - రారాపోదము - నా రాజా
పోదము వలపులపేటా - పాడుద మొకటేపాటా ‖చాలు‖

సమాప్తి.

మెజిస్టిక్ ప్రెస్, కలర్ ప్రింటర్సు, రాజమండ్రి — 30,000 1948.

# నిర్మాతలు

| | | |
|---|---|---|
| డైరెక్టరు | ... | జి. బలరామయ్య |
| కవి | ... | సముద్రాల |
| ఫొటోగ్రఫీ | ... | వి. శ్రీధర్ |
| సౌండు | ... | వి. మీనాక్షి సుందరం |
| మ్యూజిక్ | ... | గాలిపెంచల నరసింహారావు |
| | ... | జి. వెంకటేశ్వర్రావు |
| బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ | ... | సి. ఆర్. సుబ్బరామన్ |
| ఆర్టు | ... | యస్.వి.యస్. రామారావు |
| ఎడిటరు | ... | టి. యం. లాల్ |
| మేకప్ | ... | కె. గోపాలరావు |
| స్టిల్సు | ... | యమ్. సత్యం |
| డ్యాన్సు | ... | వేదాంతం రాఘవయ్య |
| ప్రొడక్షన్ చీఫ్ | ... | వి. కోటేశ్వరరావు |
| స్టూడియో | ... | న్యూటోన్, మదరాసు. |

## రానున్న మహోజ్వల చిత్రములు

జూపిటరువారి : ... ... అభిమన్యు

సువర్ణలతావారి: ... ... సువర్ణమాల

బి. ఏ. సుబ్బారావు మరియు శోభనాచలవారి } పల్లెటూరిపిల్ల

ప్రతిభావారి: ... ... స్వప్నసుందరి

ఆర్. పద్మనాభంగారి : ... రక్షరేఖ

శోభనాచలవారి: ... తిలోత్తమ, ఆశాలత

జూపిటరువారి : ... ... మోహిని

ఇంకా - మరెన్నో ???

బుక్కింగు వివరాలకు

# పూర్ణా పిక్చర్సు,

విజయవాడ, గుంతకల్లు.